క్లుప్తంగా

గ్లకోమాపై అవగాహన ర్యాలీ



పెనమలూరు: ప్రపంచ గ్లకోమా నివారణ వారోత్సవాల సందర్భంగా ఆదివారం ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి సిబ్బంది తాడిగడపలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మయాంకా రాయ్ మాట్లాడుతూ గ్లకోమాపై ప్రజల్లో అవగాహన కల్పించడాకి ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. గ్లకోమాపై వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. గ్లకోమా అనేది కంటి ఒత్తిడి సంబంధిత దృష్టిలోపం కలిగించే వ్యాధి అని అన్నారు. కొన్ని రకాల వ్యాధులకు దీర్ఘకాలంగా స్టెరాయిడ్స్ వాడటం వలన దృష్టిలోపంకు దారి తీస్తుందని తెలిపారు. 2040 సంవత్సరం నాటికి గ్లకోమా వ్యాధి బారిన పడేవారి సంఖ్య 111 మిలియన్లకు పెరగవచ్చని అన్నారు. గ్లకోమాను ముందుగానే గుర్తిస్తే అంధత్వ నివారణ చేయవచ్చని పేర్కొన్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఊంజల్ సేవ



గన్నవరం: స్థానిక పాత గన్నవరంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో ఆదివారం ఊంజల్ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారి వార్షిక కల్యాణం జరిగి 16 రోజులు పూర్తయిన సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన ఉయ్యాలలో శ్రీలక్ష్మీ తిరుపతమ్మ సమేత గోపయ్యస్వామి ఉత్సవమూర్తులను ఉంచి ఊంజల్ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీధర్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పేదలకు ఆర్థిక సాయం



కంకిపాడు: పేదలకు అండగా నిలవాలని వక్తలు పేర్కొన్నారు. చలసాని చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన నెప్పల్లి గ్రామంలో ఆదివారం ఇద్దరు పేదలకు రూ. 10 వేలు, ఐదుగురికి రూ. 5 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో చలసాని అరుణ్ ప్రసాద్, చలసాని భాగ్యనిరంజన్‌రావు, చలసాని వెంకటేశ్వరరావు, సీహెచ్ సురేష్, శ్రీనివాసరెడ్డి, రత్నబాబు, దేవినేని మురళి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పోరంకిలో రంగా విగ్రహం ఆవిష్కరణ



పెనమలూరు: పోరంకి గ్రామంలో దివంగత వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఆదివారం ఆవిష్కరించారు. గ్రామంలోని నిడమానూరు రోడ్డులో రంగా విగ్రహాన్ని రాధారంగా మిత్ర మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. మంత్రి జోగి రమేష్ రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత, కానూరు మాజీ సర్పంచి దేవభక్తుని సుబ్బారావు, మైనార్టీ సెల్ నాయకుడు షేక్ చిన్నా, విగ్రహ కమిటీ అధ్యక్షుడు కాపరౌతు సత్యనారాయణ, సభ్యులు బొర్రా కృష్ణ, వీర్ల సుబ్బారావు, గట్టు శ్రీనివాసరావు, తాడికొండ అనంతకుమార్, మోర్ల మహీధర్, వెలగా మల్లిఖార్జునరావు, పచ్చిగళ్ల నాగరాజు, పీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గంగూరులో పరిశుద్ధ స్లీవ మార్గం



పెనమలూరు: గంగూరు గ్రామంలో ఆదివారం పరిశుద్ధ స్లీవ మార్గం నిర్వహించారు. కానూరు కార్మెల్ చర్చి ఆధ్వర్యంలో గత కొద్ది రోజులుగా పోరంకి, సాలిపేట, గంగూరు గ్రామాల్లో క్రైస్తవ పవిత్ర దినాలు భక్తిశ్రద్ధలతో ఉపవాస ప్రార్థనలు జరుగుతున్నాయి. ఫాదర్ సలివేంద్ర సౌరి ఆధ్వర్యంలో గంగూరు గ్రామంలో పరిశుద్ధ స్లీవ మార్గం, దివ్యబలి పూజలు నిర్వహించారు. భక్తులకు దివ్య ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఫాదర్ దేవరాజు, దీక్షపులు, ఉపదేశకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదల గృహాలకు విద్యుత్ వెలుగులు

- జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు
- రూ. 6.90 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటు
- రూ. 1.50 కోట్లతో విద్యుత్ లైన్లు



నున్న జగనన్న కాలనీలో 33/11కేవీ ఇండోర్ విద్యుత్ సబ్ స్టేషన్



విజయవాడరూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేర్చడంతో పాటు జగనన్న కాలనీల్లో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ మధ్యప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ రూ. 6.90 కోట్లతో నున్న విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నున్న, సూరంపల్లి, కొండపావులూరు గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో 33/11 ఇండోర్ విద్యుత్ ఉపకేంద్రాలను నిర్మించింది. ఈ విద్యుత్ సబ్‌స్టేషన్లకు నున్న గ్రామంలోని 220కేవీ విద్యుత్ స్టేషన్ నుంచి విద్యుత్ లైన్లను అనుసంధానం చేస్తూ ముమ్మరంగా పనులు జరుగుతున్నాయి. దీంతో జగనన్న కాలనీల్లోని 21,700 పేద కుటుంబాల్లో విద్యుత్ కాంతులు వెల్లివిరియనున్నాయి. నున్న గ్రామంలో 8,200, సూరంపల్లి గ్రామంలో 6,500, కొండపావులూరు గ్రామంలో 7 వేల కుటుంబాలకు విద్యుత్ వెలుగులు రానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రూ. 1.50 కోట్లతో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తోంది. జగనన్న కాలనీల్లో ప్రత్యేకంగా నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్ల కారణంగా వేసవి కాలంలో లోఓల్టేజ్ సమస్యకు పరిష్కారం లభిస్తుందని డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె.బాలాజీ తెలిపారు. నున్న, పాతపాడు పరిసర గ్రామాల్లో విద్యుత్ లోఓల్టేజ్ సమస్యను అధిగమించేందుకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేకంగా నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్ల వల్ల ప్రస్తుతం నున్న గ్రామంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌పై ఒత్తిడి తగ్గి నాణ్యమైన విద్యుత్ సరఫరా జరిగేందుకు అవకాశం ఏర్పడుతుంది. అంతేకాక రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న తొమ్మిది గంటల ఉచిత విద్యుత్ సరఫరా కూడా మెరుగుపడుతుంది. ఎక్కడా విద్యుత్ కోతలకు అవకాశం లేకుండా 24/7 విద్యుత్ సరఫరా జరిగే అవకాశాలు మరింత మెరుగుపడతాయి. **ప్రస్తుతం నున్న సబ్‌స్టేషన్ పరిధిలో వేసవికాలంలో 540 యాంప్స్ విద్యుత్ వినియోగం జరుగుతోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన నవరత్నాల్లో ఒకటైన పేదల సొంతింటి కల నెరవేర్చడంతో పాటు, కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.**

ఉచితంగా విద్యుత్ మీటర్లు



నున్న గ్రామంలోని జగనన్న కాలనీలో సుమారు రెండువేల కుటుంబాలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ మీటర్లు, సర్వీస్ వైర్లు, బోర్డులను అందజేయడం జరిగింది. మా కుటుంబాల్లో విద్యుత్ కాంతులు వెలుగుతున్నాయి.

– షేక్ హుస్సేన్, నున్న గ్రామం

మూడు విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణం



పేదలకు ఉచితంగా విద్యుత్ మీటర్లు, సర్వీస్ వైర్లు, బోర్డులు కలిపి సుమారు ఒక్కొక్క ఇంటికి మూడువేల రూపాయల విలువ చేసే పరికరాలను రాష్ట్ర ప్రభుత్వం అందజేసింది. నున్న, సూరంపల్లి, కొండపావులూరు గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో మూడు విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మించడం జరిగింది. త్వరలోనే అన్ని కుటుంబాలకు అవసరమైన విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తాం.

– జె.బాలాజీ, డీఈ

ప్రజల సమస్యలు పరిష్కరిస్తా

మంత్రి జోగి రమేష్



పోరంకిలో స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

పెనమలూరు: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తానని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ అన్నారు. పోరంకి సాలిపేటలో మంత్రి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది ప్రజా ప్రభుత్వమని, నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు పేద ప్రజల కోసం అమలు చేస్తోందని అన్నారు. ఏదైనా కారణంతో పథకాలు అందని వారు ఉంటే పరిశీలించి పథకాలు అమలు చేసే విధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అనంతరం స్థానిక చర్చిలో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో టిడ్కో డైరెక్టర్ పీ రాఘవరావు, మున్నంగి అర్జున్‌రెడ్డి, రచ్చా వెంకటేశ్వరరావు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

అంబాపురంలో ప్రతి గడపకూ ప్రభుత్వ సంక్షేమం



అంబాపురంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న పార్టీ నాయకులు

అంబాపురం(విజయవాడరూరల్): వైఎస్సార్ సీపీ ఆదేశాల మేరకు ఆదివారం అంబాపురం గ్రామంలో 'ప్రతి గడపకూ ప్రభుత్వ సంక్షేమం' కార్యక్రమం జరిగింది. గడిచిన నాలుగున్నరేళ్లల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతీ ఇంటికి అందించిన సంక్షేమ పథకాలను పార్టీ గ్రామ కన్వీనర్ నల్లమోతు చంద్రశేఖర్, కో–కన్వీనర్ తోడేటి బెంజిమెన్ ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. పేదలకు సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ప్రజలు పిలిస్తే పలికే వల్లభనేని వంశీమోహన్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మహిళా ప్రధాన కార్యదర్శి గొడ్డళ్ల రోజామణి, సచివాలయ కన్వీనర్ తోడేటి కిరణ్, పార్టీ సీనియర్ నాయకులు దేవరపల్లి రాజా, సొంగా నాని, కలపాల సురేష్, కొమ్ము పండు, గుండాల వెంకట్, ఉదయ్‌కిరణ్, ఐల, శివ, సొంగా దయాకర్, చేబోయిన కిషోర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతియుత ఎన్నికలకు అందరూ సహకరించాలి



వీఎన్.పురంలో కవాతు చేస్తున్న పోలీసులు

గన్నవరం: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పక్షాలు, ప్రజలు సహకరించాలని సీఐ కేవీఎస్వీ ప్రసాద్ పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మండలంలోని కేసరపల్లి, వీఎన్.పురం, బుద్దవరం, అజ్జంపూడి గ్రామాల్లో ఆదివారం పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ప్రసాద్ మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిపేందుకు పోలీస్‌శాఖ సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతీ ఒక్కరు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన వెంటనే పోలీస్ శాఖకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎస్ఐ శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

కసుకుర్తి రాజా సేవలు అభినందనీయం



రాజా, చలసాని, అంజయ్యలను సత్కరిస్తున్న గ్రామస్తులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: అతి సాధారణ రైతు కుటుంబంలో జన్మించి అంచలంచెలుగా ఎదిగిన ప్రవాస భారతీయుడు కసుకుర్తి రాజా నిస్వార్థంగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని పలువురు కొనియాడారు. ఇటీవల ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై తొలిసారిగా స్వగ్రామమైన బాపులపాడు మండలం వీరవల్లి విచ్చేసిన రాజాతో పాటుగా 'ప్రాజెక్ట్ కామధేను' పేరిట గ్రామంలో పాల ఉత్పత్తుల ఫ్యాక్టరీని ఏర్పాటు చేసి ఎందరికో ఉపాధి కల్పించిన కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులకు గ్రామస్తులు ఆదివారం పౌర సన్మానం నిర్వహించారు. పీఏసీఎస్ మీటింగ్ హాల్‌లో మాజీ సర్పంచి నందమూరి కృష్ణప్రసాద్ అధ్యక్షతన రాజా, ఆంజనేయులతోపాటు తానా మాజీ అధ్యక్షుడు లావు అంజయ్యను గ్రామస్తులు పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వీరవల్లి సర్పంచి పిల్లా అనిత, హనుమాన్ షుగర్స్ మాజీ చైర్మన్ గుండపనేని ఉమావరప్రసాద్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వేగిరెడ్డి పాపారావు, ఏపీ సాగునీటి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, మాజీ సర్పంచి వేములపల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ జిల్లా మాజీ కార్యదర్శి కోడెబోయిన బాబి పాల్గొన్నారు.

బెల్టుషాపులపై దాడులు

కంకిపాడు: పట్టణంలోని పలు ప్రధాన ప్రాంతాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తున్న ప్రాంతాలపై పోలీసులు ఆదివారం విస్తృత దాడులు నిర్వహించారు. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని పులి రామారావునగర్ ప్రాంతంలో బెల్టుషాపులు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆ ప్రాంతంలో తనిఖీలు చేశారు. తనిఖీల్లో భాగంగా చిలకూరి బుచ్చిబాబు వద్ద ఆరు, చిత్తలూరి పరమేశ్వరరావు వద్ద ఎనిమిది, యామగాని దుర్గారావు వద్ద ఐదు, వేముల రాంబాబు వద్ద ఎనిమిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. బెల్టుషాపులు నిర్వహిస్తున్న నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 27 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ యాక్టు కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సందీప్ తెలిపారు.

నేడు రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ

ఉంగుటూరు: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం లబ్ధిదారులకు సోమవారం రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ చేసేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు రంగం సిద్ధం చేశారు. తేలప్రోలులో జరిగే పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఎంపీపీ వడ్లమూడి సరోజిని, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వింత శంకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ వి.ఆదినారాయణరెడ్డి(నాని), ప్రజా ప్రతినిధులు, పలువురు పార్టీ నాయకులు పాల్గొంటారని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించాలి



బహుమతి అందజేస్తున్న ఎంపీపీ రవి

గన్నవరం: ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రతీ ఒక్కరు ప్రోత్సహించాలని ఎంపీపీ అనగాని రవి పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో గన్నవరం వాలీబాల్ క్లబ్ ఆధ్వర్యాన గత మూడు రోజులుగా జరుగుతున్న వాలీబాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన జట్లకు ఎంపీపీ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చక్కటి వాతావరణంలో వ్యాయామ విద్య ఉపాధ్యాయులు సమిష్టిగా ఈ పోటీలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ సహకారంతో ఈ క్రీడా ప్రాంగణాన్ని మరింత అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ప్రతిభావంతులైన వాలీబాల్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా క్లబ్‌ను ఏర్పాటు చేయడం హర్షణీయమని ఎయిర్‌పోర్ట్ ఎస్పీఎఫ్ డీఎస్పీ గుప్తా పేర్కొన్నారు. పోటీల్లో గన్నవరం జట్టు విజేతగా నిలవగా, ఎయిర్‌పోర్ట్, హెచ్‌సీఎల్ జట్లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. క్లబ్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్, ఉపాధ్యక్షుడు రామారావు, కార్యదర్శి బాలకృష్ణ, కోశాధికారి రవిప్రకాష్, కార్యనిర్వాహక కార్యదర్శి రాంబాబు, పీడీ నాగరాజు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించేందుకు సైనికుల్లా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ముజఫర్

గన్నవరం: రానున్న ఎన్నికల్లో బీజేపీ కూటమిని ఓడించేందుకు ప్రతీ ఒక్కరు సైనికుడిలా పని చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ పిలుపునిచ్చారు. స్థానిక అట్లూరి శ్రీమన్నారాయణ మీటింగ్ హాల్‌లో ఆదివారం సీపీఎం నాయకులు, ప్రజాస్వామ్యవాదులు, విద్యావంతులతో నియోజకవర్గ విస్తృత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముజఫర్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల కార్మికులు, కర్షకులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. మతోన్మాద బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ, ప్రభుత్వ ఆస్తులు కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన పార్టీలతో బీజేపీ పొత్తుపెట్టుకుని ఎన్నికలకు వస్తున్నాయని, వారి పొత్తు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు. బీజేపీ వల్ల రాష్ట్రానికి అన్ని రకాలుగా నష్టం జరిగిందన్నారు. ఈ విషయాలను మరిచి టీడీపీ, జనసేన రాజకీయ లబ్ధి కోసం బీజేపీతో కలిసి వెళ్లేందుకు సిద్ధమవడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఈ పార్టీలను ఓడించాల్సిన బాధ్యత ప్రజాస్వామ్యవాదులు, ఎర్రజెండా పార్టీలు, వాటి మిత్రపక్షాలపై ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు ఆర్ రఘు, అనుమోలు వెంకటేశ్వరరావు, మల్లంపల్లి ఆంజనేయులు, కళ్లం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల ఉన్నతికి ప్రభుత్వం చేయూత



క్రీడాకారులకు కిట్లు అందజేస్తున్న మంత్రి జోగి రమేష్, దేవినేని అవినాష్

కంకిపాడు: క్రీడాకారుల అభ్యున్నతికి ప్రభుత్వం చేయూత అందిస్తోందని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. పునాదిపాడు గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నేత పిడికిటి రామకోటేశ్వరరావు పుట్టినరోజు సందర్భంగా క్రీడాకారులకు వాలీబాల్, క్రికెట్ కిట్లు, టీషర్టులను ఆదివారం రాత్రి పంపిణీ చేశారు. గ్రామంలోని ప్రధాన సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని, క్రీడాకారులకు అండగా నిలుస్తోందని అన్నారు. క్రీడాకారులు ప్రభుత్వ సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్, తూర్పు పరిశీలకుడు అన్నే చిట్టిబాబు, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, వైస్ ఎంపీపీ కలపాల ప్రకాష్, అగ్రిబోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, మారేడుమాక, తెన్నేరు సర్పంచ్‌లు సీహెచ్ ఆదర్శకుమార్, జుజ్జవరపు ఎలీషా, సొసైటీ చైర్మన్ వీర్ల జగపతిరావు, లాం సురేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు సచివాలయ భవనాలు ప్రారంభం





పెనమలూరులో నిర్మించిన సచివాలయ భవనాలు



పునాదిపాడులో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రైతుభరోసా కేంద్రం

పెనమలూరు: నియోజకవర్గ కేంద్రం పెనమలూరు గ్రామంలో నిర్మించిన మూడు సచివాలయ భవనాలను సోమవారం రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ ప్రారంభించనున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మూడు నూతన సచివాలయ భవనాలు నిర్మించడం జరిగింది. మూడు సచివాలయాలకు ప్రభుత్వం రూ. 1.20 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఒకటి, మూడో సచివాలయ భవనాలు తహసీల్దార్ కార్యాలయం సమీపంలో నిర్మించారు. రెండో నంబర్ సచివాలయ భవనం జగనన్న కాలనీ సమీపంలో నిర్మాణం చేశారు. గ్రామంలో దాదాపు 20 వేల మంది జనాభా ఉంటున్నారు. ఈ సచివాలయాల భవనాలు ప్రారంభమయితే పాలన మరింత చేరువ కానుంది.

నేడు ప్రారంభం..

గ్రామంలో నిర్మించిన మూడు సచివాలయాలను సోమవారం మంత్రి జోగి రమేష్ ప్రారంభిస్తారని సర్పంచి లింగాల భాస్కరరావు తెలిపారు. సోమవారం సాయంత్రం కార్యక్రమం జరుగుతుందని గ్రామస్తులు అందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభోత్సవం, శంకుస్థాపన

కంకిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలను సోమవారం నిర్వహించనున్నారు. కోట్లాది రూపాయల విలువైన పనులను రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

పునాదిపాడులో రైతుభరోసా, వెల్‌నెస్ సెంటర్..

పునాదిపాడు గ్రామ పరిధిలో ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు సచివాలయం–1 పరిధిలో రైతుభరోసా కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను నిర్మించారు. ప్రభుత్వం నుంచి రూ. 24 లక్షలు రైతుభరోసా కేంద్రం నిర్మాణానికి నిధులు కేటాయించగా, పంచాయతీ నుంచి మరో రూ. 4 లక్షలు వెచ్చించి అన్ని హంగులతో నిర్మాణాన్ని పూర్తి చేశారు. రూ. 21 లక్షలతో హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను నిర్మించగా, నిర్మాణం పూర్తి కావడానికి పంచాయతీ నుంచి మరో రూ. 5 లక్షలు వెచ్చించి నిర్మాణాలను పూర్తి చేశారు. ఈ రెండు భవనాలను సోమవారం మంత్రి రమేష్ ప్రారంభించనున్నారు.

కంకిపాడులో అంగన్‌వాడీ కేంద్రం..

కంకిపాడు పట్టణంలోని పద్మావతీనగర్‌లో రూ. 14 లక్షల అంచనా వ్యయంతో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్మించారు. ఇందులో ఉపాధి హామీ పథకం నిధులు రూ. 7 లక్షలు, మండల పరిషత్ నిధులు మరో రూ. 7 లక్షలతో నిర్మాణం పూర్తి చేసి చిన్నారులకు అందుబాటులోకి తెచ్చారు.

తీరనున్న రహదారి అవస్థ..

మద్దూరు–ఉప్పలూరు ఆర్అండ్‌బీ రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించనుంది. కరకట్ట నుంచి కంకిపాడు–గన్నవరం రోడ్డును కలుపుతూ మద్దూరు, వణుకూరు, గోసాల, ఈడుపుగల్లు గ్రామాల మీదుగా ఉన్న రహదారి గోతులమయంగా మారింది. రహదారిని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. సీఆర్ఎఫ్ నిధులు రూ. 19.20 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో మద్దూరు–ఉప్పలూరు రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు శంకుస్థాపన జరగనుంది. మంత్రి జోగి రమేష్ చేతుల మీదుగా ఈడుపుగల్లు సెంటర్‌లో రోడ్డు పనులకు శంకుస్థాపన చేయడానికి ఏర్పాట్లు చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులో నివాసం ఉంటున్న కొల్లా వంశీకృష్ణకు సీఎం సహాయ నిధి నుంచి లక్ష మంజూరవ్వగా ఆదివారం సర్పంచి రాచమళ్ల పూర్ణచంద్రరావు చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ వంశీకృష్ణ అనారోగ్య కారణాల వల్ల ఇటీవల హాస్పిటల్‌లో చికిత్స పొందాడని తెలిపారు. వీరి ఆర్థిక పరిస్థితి గురించి ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ దృష్టికి తీసుకెళ్లడంతో సీఎంఆర్ఎఫ్ మంజూరుకు కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, వార్డు సభ్యులు రాచమళ్ల శ్రీనివాసరావు, మట్టా క్రాంతిసరోజ్ తదితరులు పాల్గొన్నారు.